రేపటి నుంచి ఎపి పాలిసెట్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

ఎపి పాలిసెట్ 2024లో ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 1 నుంచి 26 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి.శివ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఎపి పాలిసెట్ 2024 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ నెల 27న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా రాయచోటి కేంద్రంగా పాలిసెట్ నిర్వహిస్తున్నారన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లి ప్రవేశ పరీక్ష రాయవలసిన అవసరం లేదని తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తును ఏప్రిల్ 5లోగా చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ఒసి, బిసి విద్యార్థులు రూ. 400, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.100 తీసుకుని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా చంద్రబాబునాయుడు

ప్రొద్దుటూరును అభివృద్ధి చేస్తా

- ప్రశాంత వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతా
- ఉక్కు పరిశ్రమకు ఒక్క ఇటుకా పెట్టని వైనం
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తాం
- ముస్లిం మైనార్టీలు జగన్ చెప్పేది వినొద్దు
- ప్రొద్దుటూరుకు రాచమల్లు ఓ ముల్లు
- ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

ప్రొద్దుటూరును ప్రశాంత వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతానని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణంలో ప్రజాగళం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో నియంత పాలన సాగుతోందన్నారు. ఇసుక దందా దగ్గర నుంచి బెట్టింగ్, మట్కా, గుట్కా, గంజాయి, బియ్యం, డీజిల్ మాఫియా, సెటిల్మెంట్స్, కమీషన్లు, నకిలీ నోట్లు వంటి అసాంఘిక వాతావరణం రాజ్యమేలుతోందని చెప్పారు. జిల్లాలోని కడప, పులివెందులకు ఒక్క పరిశ్రమా రాలేదని చెప్పారు. కడప ఉక్కు పరిశ్రమకు రెండు సార్లు శంకుస్థాపనలు చేశారని, ఐదేళ్లవుతున్నా ఒక్క ఇటుకా పేర్చలేదని తెలిపారు. కడప పార్లమెంట్ బరిలో వివేకా హత్య కేసులో నిందితుడైన అవినాష్‌రెడ్డిని పోటీ పెట్టి ఓట్లు వేయమంటావా, నిర్దోషిగా తేలే వరకు బయటే ఉంచడం తెలియదా అని నిలదీశారు. బుల్లెట్‌లాంటి భూపేష్‌రెడ్డి నిలబెట్టానని, ఆలోచించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ముస్లిములూ జగన్ మాట వినొద్దని విజ్ఞప్తి చేశారు. చిన్నాన్న హత్య కేసులో సిబిఐ అధికారులపైనే కేసులుపెట్టి తప్పుడు మాటలు మాట్లడతావా అంటూ ఎద్దేవా చేశారు. ఇటువంటి నాయకునికి ఓట్లు వేస్తే ఎవరికీ రక్షణ ఉండదని హెచ్చరించారు. ప్రొద్దుటూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 160 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపీ సీట్లను గెలుచుకుంటామని ధీమాను వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు ఓ ముల్లుగా మారి దోచుకుంటున్నాడని విమర్శించారు. బిసిలు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేశారన్నారు. ఒంటిమిట్టలో ఓ చేనేత కుటుంబాన్ని వైసిపి నాయకుల అరాచకాలకు బలైందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆడబిడ్డలకు రూ.1500, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లిఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తామని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, 90 శాతం సబ్సిడీతో బిందుసేద్యం పరికరాలు, మెగా డిఎస్సీ, ఇంటింటికీ తాగునీరు, 50 ఏళ్లు నిండిన బిసిలకు పెన్షన్, రాష్ట్రాన్ని ప్రపంచంతో అనుసంధానిస్తామని వంటి హామీల వరద పారించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ లింగారెడ్డి, ముక్తియార్ గుర్తింపు, గౌరవం ఇస్తామని తెలిపారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి పార్టీ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల అఫిడవిట్‌లో రూ.2.30 కోట్లు ఆస్తి చూపిన రాచమల్లు, రూ.150 కోట్లకు ఎలా చేరుకుందో చెప్పాలని నిలదీశారు. రూ.516 కోట్లతో చేసిన శంకుస్థాపనలకు ఒక్క అడుగు ముందుకు పడలేదని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో పేదలను ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ చదివిన యువతకు సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగావకాశాలు చంద్రబాబు దూర దృష్టితోనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఆయన దూరదృష్టితోనే సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో రెవెన్యూ జనరేట్ అయిందని చెప్పారు. హెలిపాడ్ వద్ద టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజంపేట అభ్యర్థి సుబ్రమణ్యం కలిశారు. కార్యక్రమంలో సిఎం సురేష్‌నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం తెల్పుతున్న చంద్రబాబు

ఎంసిసి ఉల్లంఘనపై 602 ఫిర్యాదులు పరిష్కారం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 624 ఫిర్యాదులు అందగా 602 ఫిర్యాదులకు పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 602 ఫిర్యాదులను పరిష్కరించగా 22 ప్రగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.79.54 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశామన్నారు. రూ.42.24 లక్షల మేర నగదు, రూ.17.89 లక్షల విలువైన లిక్కర్, రూ.1.40 లక్షల విలువైన గంజాయి, రూ. 18.00 లక్షల విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులున్నాయన్నారు. ఎంసిసి అతిక్రమణల కింద ఏడు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

ఎసిబి వలలో కెవి.పల్లె విఆర్ఒ

ప్రజాశక్తి-పీలేరు

ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ విఆర్ఒ ఎసిబికి చిక్కిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. పీలేరు శాసనసభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల విధుల నిర్వహణపై శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన కెవి.పల్లి మండలం, సొరకాయలపేట సచివాలయ విఆర్ఒ ఊటుకూరు ఎల్లయ్య కూడా హాజరయ్యాడు. కెవి పల్లి మండలం, గోరంట్లపల్లి పంచాయతీ, బసిరెడ్డిగారిపల్లి వడ్డీపల్లికి చెందిన రైతు కోటకొండ మల్లయ్య తన అనుభవంలోని డికెటి భూమికి చెందిన మూడు నెంబర్లను పట్టాదారు పాసుపుస్తకంలో పొందు పరచడం కోసం విఆర్ఒ రూ.9 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడని, చివరకు రూ.5 వేలు లంచంగా ఇవ్వడానికి రైతు ఖరారు చేసుకున్నాడని ఎసిబి బృందం తెలిపింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ రైతు తమను ఆశ్రయించాడన్నారు. పథకం ప్రకారం శనివారం పీలేరు శిక్షణా కేంద్రం వద్ద రైతు విఆర్ఒకు రూ.5 వేలు లంచం ముట్టజెప్పాడన్నారు. కడప ఎసిబి డిఎస్‌పి గిరిధర్ ఆదేశాల మేరకు తమ బృందం అక్కడే కాపు కాసి విఆర్ఒను రెడ్ హ్యాండెడ్‌గా నగదుతో సహా పట్టుకున్నామన్నారు. అనంతరం నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం కెవి పల్లి మండలం, సొరకాయలపేట సచివాలయానికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈ సందర్భంగా రైతుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని నిందితుడిని నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరుపరచడానికి తీసుకు వెళుతున్నట్లు చెప్పారు. ఎవరైనా అధికారులు లంచం అడిగితే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ దాడిలో ఎసిబి సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన విఆర్ఒ ఎల్లయ్య

కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్రంలోని బిజెపి పదేళ్ల పాలనలో 50 ఏళ్లు, రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ల పాలనలో 20 ఏళ్లు అభివృద్ధి వెనక్కి వెళ్లిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా గ్యారెంటీ అని అధికారంలోకి వచ్చిన తరువాత ముగిసిన అధ్యాయం అని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రత్యేక హోదా ఇస్తుందని తెలిపారు. మహిళలకు ప్రతినెల రూ. 8500 ఇస్తామని, ఇది మహిళలకు భరోసా ఇచ్చే పథకం అని ఆయన చెప్పారు. రైతుకు రెండు లక్షల వరకు రుణ మాఫీ ఉంటుందన్నారు, పెట్టుబడి మీద 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర ఉంటుందన్నారు. శనివారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కనీస వేతనం రూ. 400 లు, విద్యార్థులకు కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.20 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. రాహుల్ గాంధీ మొట్ట మొదటి సంతకం ఉద్యోగాల మీదే ఉంటుందన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ పెన్షన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం, షర్మిలను ముఖ్యమంత్రి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలకు చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - రాయచోటి : పదో తరగతి పరీక్షల శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 18 నుంచి ప్రారంభమైన పరీక్షలు 30తో ముగిశాయి. ఈనెల 20న లక్కిరెడ్డిపల్లి మండలంలో ప్రశ్న పత్రం బయటికి రావడంతో 26 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు .జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 25,522 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఎస్‌పి కృష్ణారావు తనిఖీలు నిర్వహించి 144 సెక్షన్ అమలు చేశారు.

కార్యకర్తల నిర్ణయానికి కట్టుబడతా : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రాజంపేట నియోజకవర్గంలో తనపై తన కేడర్ చూపుతున్న మమతానురాగాలు వెలకట్టలేనివని, వారు తీసుకునే నిర్ణయానికే కట్టుబడతానని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ సీటును సుగవాసి సుబ్రహ్మణ్యంకు కేటాయించడంపై తన కార్యాల యంలో శనివారం కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగవాసికి సీటు రాకుంటే ఆయనను బుజ్జగించుకోవాలి గానీ, తన సీటును ఆయనకు కేటాయించడం ఏంటని చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. నెత్తిన బంగారు కిరీటం పెట్టి బతిమాలినా తనకు ఎమ్మెల్యే సీటు తప్ప మరేమీ అవసరం లేదని తేల్చి చెప్పారు. ఐదేళ్లపాటు కష్టకాలంలో తన దగ్గర పని చేయించుకుని చివరి నిమిషంలో తనకు టికెట్ నిరాకరించడానికి కారణాలేంటో తెలపాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తొందరపడొద్దని చరవాణి ద్వారా సంప్రదించినట్లు తెలిపారు. షర్మిల, సతీష్‌రెడ్డి సైతం తనతో చరవాణి ద్వారా పదేపదే సంప్రదింపులకు ప్రయత్నం చేస్తున్నారని, తన బలం, బలహీనత తన కేడరేనని వారి నిర్ణయం మేరకు ముందుకు వెళతానన్నారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు బత్యాల స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే తమ ప్రాణాలు అడ్డుపెట్టి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ఒక్క సారిగా మూకుమ్మడిగా నినాదాలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా లేదా అధిష్టానం ఆదేశాలను పాటిస్తారా అన్నది వేచి చూడాలి.

వైసిపి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారని వైసిపి మహిళా పట్టణ అధ్యక్షులు లేబాక సుజాతమ్మ పేర్కొ న్నారు. వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఆమె ఒకటవ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మునాఫ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిఎం జగన్ ప్రతి పథకాన్ని మహిళల ద్వారా వర్తింపజేస్తున్నారని, రానున్న ఎన్నికలలో ఆయనను సిఎంగా చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు జె.వి.కృష్ణయాదవ్, ముస్లిం నాయకులు ఎస్.ము జఫర్ అహ్మద్, ఎస్.జి.ఇనాయతుల్లా, ఆరిఫ్ నాసిర్, షేక్ గౌస్ బాషా, మహబూబ్ ఖాన్, షేక్ హైదర్ బాషా, లేబాక రమణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన :'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసమే బిజెపి, టిడిపి జనసేన కూటమిలో చేరడం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బిజెపి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తూ అభివృద్ధి జాడ లేకుండా చేస్తుంన్నదని తెలిపారు. రాష్ట్రంతో పాటు ప్రజలు కూడా ఎంతో నష్టపోయారని చెప్పారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి చేయాలంటే మూడు పార్టీల కూటమి అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మంత్రుల లాభార్జన కోసం రాజకీయాన్ని వ్యాపారంగా మార్చారని, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా కలిసి ఆంధ్రప్రదేశ్ నే మాఫియాకు అడ్డాగా మార్చేసారని విమర్శించారు. సమావేశంలో పీలేరు, పుంగనూరు, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి కూటమి అభ్యర్థులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి, యనమల భాస్కర్‌రావు, షాజహాన్‌బాషా, జయచంద్రారెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బార్ అసోసియేయన్ అధ్యక్షులుగా ఎన్నికైన ప్రభాకర్‌రెడ్డి

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఎన్. ప్రభాకర్‌రెడ్డి రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు శనివారం రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. రాయచోటి బార్ లో 81 మంది ఓటు హక్కు కలిగి ఉండగా ఎన్ ప్రభాకర్ రెడ్డికి 47 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి అయిన కె.రవిశంకర్‌కు 33 ఓట్లు మాత్రమే వచ్చాయి. ట్రెజరర్ పోస్టుకు వేల్పుల సిద్దయ్య, ఎం.వెంకట రమణ పోటీ పడగా సిద్దయ్య 45 ఓట్లతో గెలుపొందారు. ప్రత్యర్థి ఎం.వెంకట రమణకు 35 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంతకుమునుపు ప్రధాన కార్యదర్శిగా పి.రెడ్డయ్య సహాయ కార్యదర్శిగా డి.నాగముని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొరడా!

ప్రజా'దృష్టి'

ఎన్నికల కమిషన్ కొరడా ఝులిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వాలంటీర్లు మొదలుకుని జిల్లా ఉన్నతాధికారుల వరకు ఎవరినీ ఉపేక్షించడం లేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా 14 మంది వాలంటీర్లపై వేటు వేసింది. గత 15 రోజుల కిందట కలసపాడుకు చెందిన ఓ దిగువ స్థాయి ఉద్యోగిశ్రీతీ, తాజాగా డిసిసిబి చీఫ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌పైనా వేటు వేసింది. జిల్లా ఉన్నతాధికారుల్లో ఉలికిపాటుకు గురిచేసింది. టిడిపి ఎమ్మెల్సీ రాంగోవింద్‌రెడ్డి డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డిపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈయనతోపాటు మరో ఉన్నతాధికారిపై కూడా ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ముగ్గురు ఎస్‌పిలపై ఫిర్యాదు చేయడం, ఇసి వివరణ కోరడం వంటి పరిణామాల నేపథ్యంలో అధికార యంత్రాంగం ఉలిక్కి పడింది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామాలయ రాష్ట్ర ఉత్సవాల నేపథ్యంలో కలెక్టర్ ఉత్సవ నిర్వహణ అధికారులను అప్రమత్తం చేశారు. ఎటువంటి పొరపాటు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించడం గమనార్హం. ఎన్నికల ప్రచారాలకు సైతం అనుమతి తీసుకోవాలని ఇసి కోరుతుండడంపై అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో ఇటు వంటి తరహా ధోరణి లేదు. తాజాగా ఇటువంటి నిబంధన అమలు చేయడం జీర్ణించుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఉద్యోగుల దగ్గరి నుంచి రాజకీయ నాయకులు, చివరికి మీడియా వరకు అన్ని వ్యవస్థలపైనా ఎన్నికల కమిషన్ డేగకన్ను వేసింది. ఇదేతరహా నిబంధనలతో కూడిన వాతావరణం చివరి వరకు సాగితే పటిష్టమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగే అవకాశం ఉంటుంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు ఎలా ఉల్లంఘనలకు గురయ్యాయో తెలిసిందే. ఇటువంటి వాతావరణానికి భిన్నమైన రీతిలో ఎన్నికల కమిషన్ సాగుతుండడం ప్రశంసనీయమనే చెప్పాలి. ప్రజా స్వామిక వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాప్రాయానికి మన్నిక దక్కుతుంది. ఫలితంగా ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రభుత్వం సజా వుగా పాలన చేయడానికి అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో బడితే ఉన్న వాడితే రాజ్యమనే వాతావరణం ఏర్పడు తుంది. ప్రజాస్వామ్యానికి ఎనలేని హాని జరుగుతుంది. ఫలి తంగా ఇటువంటి ధోరణి నియంతృత్వానికి దారి తీస్తుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రంజాన్ వేళలు



ఇఫ్తార్ ఆదివారం (సా)	షహరీ సోమవారం (ఉ)
6.30	4.55

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

చిచ్చుపెట్టే వారి ఆటలు సాగనివ్వం :ఆర్‌జెవి

ప్రజాశక్తి-మదనపల్లి

కులాల మధ్య చిచ్చు పెట్టే వారి ఆటలు సాగనివ్వమని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ అన్నారు. శనివారం ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా నివాసం వద్ద కమ్మ సామాజిక వర్గీయులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గం ఈ వేదిక పైకి రావడం వైసిపిపై ఉన్న వ్యతిరేకతన్నారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం కమ్మ సోదరులంతా ఏకమై ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు మాట్లాడుతూ చంద్రబాబు పోరపాటు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. గంగారపు నవీన్ చౌదరి మాట్లాడుతూ తమ మద్దతు షాజహాన్ బాషాకేనని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యా సాగర్, సహదేవ నాయుడు, నాదెండ్ల వెంకట శివన్న సెల్ షాప్ శివ, కంచర్ల మల్లికార్జున నాయుడు, ఎంసిటివి రవి, నాగూర్ వలి, సంశీర్, కాపు సంఘం జిల్లా నాయకుడు గిరీస్ పాల్గొన్నారు.

వైసిపిలో కష్టపడ్డ వారికి ఫలితం లేదు

ప్రజాశక్తి - రాయచోటి

తాను పార్టీ ఆవిర్భావ దినోత్సవం నుంచి వైసిపిలో కొనసాగుతున్నానని, పార్టీలో కష్టపడిన వారికి ఫలితం లేకుండా పోయిందని వైసిపి రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ, 20వ వార్డు పి. మదనమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గాలివీడు రోడ్డులోని అర్చన విద్యాసంస్థలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక కేసులు ఎదుర్కొని ఇబ్బందులు పడ్డానని చెప్పారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలను ఎదగనివుకుండా చేస్తున్నారని ఆరోపించారు. తనకే కాకుండా తనతో పాటు పనిచేసిన నియోజకవర్గంలోని వైసిపి నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. తనను అనేక ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సభ్యత్వానికి తన రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో భవిష్యత్తు కార్యాచరణ తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ చెన్నూరు బాషా, రియాజ్, మౌలాలి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మదనమోహన్‌రెడ్డి

ప్రిన్సిపల్ యువరాజ్‌తో పూర్వ విద్యార్థులు

'మిట్స్'లో పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాల ఎంసిఎ విభాగం పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారని ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కళాశాలలో 2004-2007 ఎంసిఎ మొదటి బ్యాచ్ విద్యార్థులు కళాశాలలో సందడి చేసినట్లు తెలిపారు. ఎంతో మంది తమ విద్యార్థులు ప్రముఖ ఐటి కంపెనీలలో ఉన్నత స్థానాలలో ఉన్నారని, వారితో ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు ప్రేరణ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలతో సహా విద్యార్థులకు ఎలా ఉండాలనే విషయాన్నీ విద్యార్థులకు అల్యూమిని విద్యార్థులు వివరించారని, వారు పనిచేస్తున్న కంపెనీలలో ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు ఆఫర్ చేస్తామని అన్నారని పేర్కొన్నారు. అల్మిని విద్యార్థులు ప్రస్తుతం ఉన్న విద్యార్థులతో ఇంటరాక్షన్ అవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్, అల్యూమిని కో-ఆర్డినేటర్ కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి రెండవ, మూడవ సంవత్సర విద్యార్థులకు ప్రస్తుత సాంకేతికలు, అనుకూలతలు (టెక్నాలజీ అండ్ అడాప్టబిలిటీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో 450 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.సందీప్ కుమార్‌రెడ్డి అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజినీర్, కాంగ్నిజెంట్ టక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మిషన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్, రోబోటిక్స్, వర్చువల్ రియాల్టీ వంటి కొత్త కొత్త టెక్నాలజీలు కంప్యూటర్ సైన్స్ రంగంలో ముందంజలో ఉన్నాయని వీటిని ఉపయోగించుకొని ఐటి రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి కొత్త కొత్త టెక్నాలజీల వల్ల ఐటి రంగం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ విధంగా ఉద్యోగ అవకాశాలు పొందాలో వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ రంగంలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ టెక్నాలజీలను ఉపయోగించుకొని భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ షఫీ హెడ్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్ అండ్ డేటా సైన్స్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ రంగంలో అభివ ృద్ధి చెందుతున్న వివిధ కొత్త కొత్త టెక్నాలజీల వల్ల ఐటి రంగం మరింత అభివృద్ధి చెంది ఎన్నో ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఈ టెక్నాలజీస్ వల్ల భవిష్యత్ తరాలకు ముందుకు వెళ్లడానికి ఉపయోగపడుతుందని వివరించారు.

వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణారెడ్డి

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి తన సిబ్బందితో వాహనములను తనిఖీలు నిర్వహించారు.సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శనివారం వేకువ జామున వాహనములను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వాహనములలో ఎలాంటి రికార్డు లేకుండా డబ్బులు, రాజకీయ నాయకుల కరపత్రాలు మొదలగు వస్తు సామగ్రిని సరఫరా చేసినట్లయితే వాటిని గుర్తించి సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినచో వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజ, పోలీసులు మహబూబాషా, డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి రమా నేత్రాలయ కంటి ఆసుపత్రి బృందం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రహారం రోడ్డులోని ఎంఆర్‌సి భవనంలో రమా నేత్రాలయ కంటి ఆసుపత్రి మదనపల్లి వారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నార న్నారు. ఇందులో కంటి పరీక్షలను నిర్వహించి రోగులకు అవసరమైన శస్త్రచికిత్సలు చేపడతామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన వారికి శస్త్రచికిత్స సదుపాయం కలదన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మెమోంటో, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

విద్యుత్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

విద్యుత్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కోసం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు కస్తూర్బా బాలికల పాఠశాల ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. నేషనల్ గ్రీన్ క్రాస్ ఎన్‌జిసిపై 6,7,8,9 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ వ్యాసరచనపై పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతి ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యుత్ వాడకంపై వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యా ర్థులకు సూచించారు. కార్యక్రమంలో కస్తూరి పాఠశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలంపాట ఆదాయం రూ.1.65 లక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గొరాన్ చెరువు పంచాయతీ కుమ్మరిపల్లి సమీపంలో ఉన్న పేరాలగుట్ట వద్దనున్న రాళ్ల బండలు కొట్టుకోవడానికి శనివారం గొరాన్ చెరువు గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ వేలంపాట నిర్వహించినట్లు ఇఒపిఆర్‌డి డి.శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.1.65లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మిట్టపల్లి కృష్ణారెడ్డి రూ.1.65లక్షలకు వేలంపాట దక్కించుకున్నారని చెప్పారు. ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31, 2025 వరకు అర్హులుగా ఉంటారని అన్నారు. గత యేడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.50వేలు గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప్తి, పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ, వెంకటాద్రి పాల్గొన్నారు.

సొంత నిధులతో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోలోని భూమాయపల్లె పంచాయతీ ముత్తులూరుపాడు గ్రామంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో పశువులు సైతం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. విషయం తెలుసుకున్న మండల వైసిపి నాయకులు మల్లె ఓబయ్య యాదవ్ తన సొంత నిధులతో ట్యాంకర్ ఏర్పాటు చేసి దాహం తీరుస్తున్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

Union Bank of India (A Government of India Undertaking) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

రీజినల్ ఆఫీసు: 21/58, బిఎస్ఎన్ఎల్ కాంపౌండు వద్ద అనెక్ష్ బిల్డింగ్, హెడ్ పోస్టు ఆఫీసు ప్రక్కన, ట్రంక్ రోడ్, కడప-516001, ఎ.పి.
బ్రాంచి ఇ-మెయిల్-ubin0804801@unionbankofindia.bank; సంప్రదించండి: 8928904801.

స్వాధీనత ప్రకటన
(సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002లోని రూల్ -8(1))
(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజంపేట్ బ్రాంచ్ (04801), అన్నమయ్య జిల్లా** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **రుణగ్రహీత: (1) మెసర్స్ శ్రీ సాయి లక్ష్మీ నరసింహ కన్స్ట్రక్షన్స్,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ.పెనగతపాటి పెంచతయ్య నాయుడు, డోర్ నెం.6/958/ 1, నూనెవారిపట్టి రోడ్, రాజంపేట, అన్నమయ్య జిల్లా-516115 మరియు (2) **శ్రీ. పెనగతపాటి పెంచతయ్య నాయుడు,** డోర్ నెం.6/958/ 1, నూనెవారిపట్టి రోడ్, రాజంపేట అన్నమయ్య జిల్లా-516115 మరియు **హామీదారు: శ్రీమతి. పి వెంకట లక్షుమ్మ** నివాసం: డి.నెం.6/958/1, నూనెవారిపట్టి రోడ్, రాజంపేట అన్నమయ్య జిల్లా-516115 వారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసుల్లో పేర్కొన్న మొత్తం పేర్కొన్న **రూ.50,19,199.00** (రూపాయలు యాభైలక్షల పందొమ్మిది వేల ఒకవంద తొంభైతొమ్మిది మాత్రమే) **మరియు దానిపై వడ్డీ & ఖర్చులను** తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ తేది.**16.01.2024** నాటి డిమాండ్ నోటీసు జారీచేశారు.

రుణగ్రహీతలు మొత్తంను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిఉన్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమేమనగా క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తులను **26.03.2024**న స్వాధీనంలోకి తీసుకున్నారు.

ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజంపేట్ బ్రాంచ్** వారికి బకాయి మొత్తం చెల్లించుటకు లోబడి ఉంటుంది. బకాలకు సంబంధించి చెల్లించిన మొత్తాలను ఏవేని ఉన్నచో ఖాతాలో తుది చెల్లింపు సమయానికి సర్దుబాటు చేయబడును.

సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి రుణగ్రహీతలకు అందుబాటులోవున్న సయమానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (8) నియయాలను అనుసరించి రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

సెక్యూర్డు అసెట్ వివరణ:
డోర్ నెం.6/958-1, నూనెవారిపల్లి, రాజంపేట్ మున్సిపాలిటి, వై.ఎస్.ఆర్.కడప లోగల 146.70చ.గ.ల విస్తీర్ణం కలిగియున్న హామీదారు పి. వెంకట లక్షుమ్మ వారి పేరునగల బిల్డింగ్ (జి+2)తో నివాసిత సైటు మరియు సరిహద్దులు: **తూర్పు:** పల్లెటి హరిప్రసాద్ ఖాళీ స్థలం, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ఎస్.రాములమ్మ ఇల్లు, **దక్షిణం:** రోడ్డు.

తేది: 26.03.2024 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : కడప. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున**

బిసిల సంక్షేమమే టిడిపి ధ్యేయం : 'మండిపల్లి'

సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

బిసిల సంక్షేమమే టిడిపి ధ్యేయమని రాయచోటి అసెంబ్లీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారము ఏర్పాటుచేసిన జయహో బిసి సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1982 సంవత్సరం కంటే ముందు ఏపిలో ఎక్కడ ఏ కులం ఉందో తెలియదని, వారి నందరిని ఒక వేదిక పైకి తెచ్చి సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా చేయడమే కాకుండా పార్లమెంటుకు, ఇటు అసెంబ్లీకి పంపించిన ఘనత టిడిపిదేనని అన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి కూడా అవకాశాలు కల్పిస్తూ టిడిపి ముందుకు నడిపిస్తోందని అన్నారు. బిసిల కోసం చంద్రబాబునాయుడు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. 2014 నుంచి 2019 వరకు విద్య, ఉపాధి పరంగా కోట్ల రూపాయలతో అనేక పథకాలు తీసుకువచ్చారని అన్నారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక అత్యధికంగా నష్టపోయింది బిసిలేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క కార్యకర్తను తమ కుటుంబ సభ్యునిగా చూడడమే కాకుండా బిసిలను సర్పంచ్‌లుగా, ఎంపిటిసిలుగా గెలిపించుకునే బాధ్యతను తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, రవీంద్రారెడ్డి, అలగాని రెడ్డప్ప, బిసి జనరల్ సెక్రెటరీ, జనార్దన్ గౌడ్ కురుబసంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, మల్లికార్జున, దేవగుడిపల్లి మాజీ సర్పంచ్, నూర్ భాషా మాజీ సర్పంచ్, సాంబశివయ్య సాధికార సంఘం అధ్యక్షులు, గురవయ్య మాజీ సర్పంచ్ వండాడి, మీసాల చిన్నప్ప, చిన్న రెడ్డయ్య ఎంపిటిసి శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పీలేరు : టిడిపి బిసిల సంక్షేమానికి, వారి అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందని, టిడిపి రాష్ట్ర ఈడిగ, బిసి సాధికారిక కార్యదర్శి పురం రామ్మూర్తి, మాజీ మండల ఉపాధ్యక్షులు పోలిశెట్టి సురేంద్రలు పేర్కొన్నారు. పీలేరులో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వం వెనకబడిన తరగతులకు 50 ఏళ్లకే నాలుగువేలు పెన్షన్, ప్రత్యేక బిసి రక్షణ చట్టం, గతంలో అమలు చేసిన ఆదరణ పథకం ద్వారా పనిముట్లను అందిస్తామని చెప్పారు. చంద్రన్న బీమా ద్వారా రూ.10 లక్షలు అందించనుందని అన్నారు. బిసిలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసి విద్యార్థుల విదేశీ విద్యకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. 34 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించిందని, వైసిపి రాజకీయంగా బిసిలను అణగదొక్కుతూ 24 శాతానికి తగ్గించిందన్నారు. ఈ కుట్రపూరిత ప్రభుత్వం బీసీలను 300 మందికి పైగా అతి కిరాతకంగా హత్య చేయించిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో రూ.75 వేల కోట్లు దారి మళ్లించి వెనుకబడిన తరగతులను వెనక్కి నెట్టేసిందని విమర్శించారు. కార్యక్రమంలో పసుపులేటి లక్ష్మీకర, వసంతాల రాజా, రమాదేవి, బిసి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి బిసి నాయకులు

తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు : ఎంపిడిఒ

బండ్ల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలను చేపట్టాలని ఎంపిడిఒ షాలెట్ అన్నారు. శనివారం మండలంలోని బండ్లపై, తవళం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవికాలంలో తలెత్తే తాగునీటి సమస్యలపై ముందస్తుగా చర్యలను చేపట్టాలని, నీటిని వృధా కాకుండా పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయంలోని సిబ్బందికి సూచించారు. తాగునీటి పైపుల మరమ్మతులు, నీటి సరఫరా అంతరాయాలు మొదలగున వాటిని వెంటనే గుర్తించి స్థానిక సర్పంచ్‌లతో కలసి పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్క ఉద్యోగి తమ పరిధిని గ్రహించి, ఎన్నికల కోడ్ కు అనుగుణంగా విధులను నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై తక్షణం చర్యలు చేపడతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఒలు ఎన్నికల కోడ్‌ను అతిక్రమించి ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎవరూ కూడా సభలు, సమావేశాలు, ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించరాదని, అటువంటి సంఘటనలు ఎక్కడైనా జరుగుతున్న వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సదస్సు జరిపి తీరుతాం'

ప్రజాశక్తి-రాయచోటి

గుంటూరు కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సదస్సు జరిపి తీరుతామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి దుడ్డ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయ కులతో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వై.రవీంద్రమాదిగ అధ్యక్షతన రాయచోటిలో జిల్లా ముఖ్య నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టబద్దతకు గత 30 సంవత్సరాలుగా అలుపెరిగిన పోరాటం చేస్తున్నామని అన్నారు. శనివారం గుంటూరులో జర గాల్సిన రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆంక్షలు విధించారని పేర్కొ న్నారు. సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినంత మాత్రాన వారి బెదిరింపులకు తలొగ్గేది ఏప్రిల్ 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్రం నలుమూలల నుండి గ్రామస్థాయి నుండి కార్యకర్తలు తరలివచ్చి రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వైసిపి నాయకుల అండదండలతో కృష్ణ మాదిగపై బురదజల్లే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల సమావేశాన్ని అడ్డుకోవడం అంటేనే ఓడిపోతామనే భయం సిఎం జగన్‌లో స్పష్టం కనిపిస్తోందన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైన మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గుంటూరులో రాష్ట్ర సదస్సు నిర్వహించి తీరుతామని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ముచిన్న, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు శివయ్య, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ , ఎంఎస్‌పి పిలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, తంబళ్లపల్లి ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపాల్, మండల అధ్యక్షులుగంగాధర్, ఎంఆర్‌పిఎస్ యువసేన అధ్యక్షులు విశ్వనాథ్, రమణ రాజశేఖర్, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దుడ్డు రామకృష్ణ

ఆర్‌టిపిపి కాలుష్యం.. దెబ్బతింటున్న ప్రజారోగ్యం, పంటలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆర్‌టిపిపి నుండి ఎక్కువగా వెదజల్లుతున్న కాలుష్యం వల్ల వాతావరణం దెబ్బతింటోంది. విద్యుత్తు ఉత్పత్తి కోసం స్టేజ్ 1,2,3,4 చిమ్నీలు ఏర్పాటు చేశారు. వీట నుంచి నుంచి రెండు చిమ్నీల ద్వారా విపరీతంగా వెలువడే పొగ, బూడిద, దుమ్ము, ధూళి గాలిలో వ్యాపించి తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. తద్వారా గాలి, నీరు, వాతావరణం కాలు ష్యమవుతున్నాయి. కాలుష్యం ధాటికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ముద్దనూరుకు ఆర్‌టిపికి 9కిలోమీటర్లు దూరం ఉంది. దూరంగా ఉన్న ముద్దనూరులో ఇలాంటి పరిస్థితి ఉంది. ఇక ఆర్‌టిపిపి సమీ పాన ఉన్న గ్రామాల పరిస్థితి దారుణంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నిలిపిన వాహనాలు, బైకులు దుమ్ముతో నిండుకుంటున్నాయని వాపోతున్నారు. ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చేరి పేరుకుపోతోందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. విపరీతంగా పెరిగిపోయిన కాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెదజల్లుతున్న బూడిద, దుమ్ము, ధూళి వల్ల నీరు, గాలి, వాతావరణం కాలుష్యం కావడంతో అనారోగ్యం బారిన పడు తున్నామని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఇంత కాలుష్యం లేదని, ప్రస్తుతం కొన్ని ఎక్కువంగా కాలుష్యం వెదజల్లుతోందని అల్లాడిపోతున్నారు. ఆర్‌టిపిపి నుండి వెదజల్లుతూ వ్యాపిస్తున్న కాలుష్యాన్ని నివారించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చిమ్నీల నుంచి వెలువడుతున్న పొగ, బూడిద, కాలుష్యం

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎండ తీ వ్రత అధికంగా ఉన్నం దున ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్ర త్తలు తీసు కోవాలని తహశీల్దార్ సౌభాగ్య లక్ష్మి తెలిపారు. శని వారం రెవెన్యూ కార్యా లయంలో ఆమె విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ వాతావరణ సమా చారాన్ని ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనం తవరకు ఇంటి నుండి బయటకు రాకుండా ఉం డాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటికి వస్తే తల తిరుగుట, వాంతులు, జ్వరం ఇతర అనా రోగ్య సమస్యలు ఉత్పన్న మవుతాయన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూ చించారు. ఎండలో గొడుగు లేకుండా తిరగ రాదన్నారు. ముదురు రంగు, మందంగల దుస్తులు ధరించరాదని పేర్కొన్నారు. బాలిం తలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడె బయట తిరగరాదని సూచించారు. వీరిపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. నిమ్మరసం, కొబ్బరి నీరు, చల్లని తాగునీరు అధికంగా సేవించాలని సూచించారు. ఆల్కహాల్, టీ, కాఫీ వంటివి తాగరాదని ఆమె వివరించారు.

సేవాభావం కలిగి ఉండాలి

వేంపల్లె :విభిన్నప్రతిభావంతులు, వృద్ధుల పట్ల సేవాభావం కలిగి ఉండాలని ధీనబంధు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి సూచించారు. ఆ ట్రస్టుకు శనివారం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు విరాళం అంద జేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. ఆ మేరకు రూ.14,500 ఆయనకు అందజేశారన్నారు. విరాళం అందజేసిన చక్రపాణిరెడ్డి, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను ఉగ్రవాదానికి పాల్పడడం దుర్మార్గం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వేంపల్లె :ఆదాయపు పన్ను శాఖ ద్వారా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాంగ్రెస్‌తోపాటు విపక్షాలపై పన్ను ఉగ్రవాదానికి పాల్పడడం దుర్మార్గమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి చేతిలో ఐటి, ఈడి, సిబిఐ కీలుబొమ్మలుగా మారాయని తప్పుపట్టారు. ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్‌కు చెందిన రూ.270 కోట్లు మేరకు 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిందన్నారు. అందులో నుంచి ఆదాయ పన్నుశాఖ రూ.135 కోట్లు స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఇది చాలక మళ్లీ రూ.1,823 కోట్లు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీకి, రూ.11 కోట్లు చెల్లించాలని సిపిఐ పార్టీకి డిమాండ్ నోటీసులు పంపడం అత్యంత దారుణమన్నారు. ఎన్నికల వేళ రాజకీయ ప్రత్యర్థి పార్టీలను ఆర్థికంగా దెబ్బతీయడమే బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

22 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని నరసాపురం, మిద్దెల గ్రామ పంచాయతీలకు చెందిన 22 మంది వాలంటీర్లు శనివారం రాజీనామా పత్రాలు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డికి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రాజీనామా పత్రాలు ఇచ్చిన విషయం వాస్తవమేనని, వీటిని ఎంపిడిఒకు సమర్పించామని చెప్పారు. జగన్మోహన్ రెడ్డికి ఏమీ న్యాయం చేయలేమనే ఉద్దేశంతో రాజీనామా చేశామని వాలంటీర్లు తెలిపారు. పైగా టిడిపి వారు తమపై నిందలు వేస్తున్నారని, తాము ఏగ్రామంలో తిరిగినా రాజకీయ బురద

ప్రచారంలో వైసిపి నాయకులు

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కలకడ

ముడియంవారిపల్లి పంచాయతీ ముడియంవారిపల్లె, కొత్తపల్లి, ముడియంవారిపల్లి, దళితవాడలో గడపగడపకు మాజీ జడ్‌పిటిసి సభ్యులు శివానందరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి, మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మండల సచివాల కన్వీనర్ మోహన్‌రాజా, సర్పంచ్ శాంతమ్మ, దేవులపల్లి అంజన్ కుమార్, కదిరాయచెరువు ప్రత్యేక ఆహ్వానితులు జివి.కిషోర్, చలమయ్య, ప్రదీప్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, నవాబ్‌పేట నరసింహారెడ్డి , మస్తాన్, హరినాథ్‌నాయుడు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న కెకె చౌదరి

టిడిపి శ్రేణులపై బైండోవర్ కేసులు దారుణం

ప్రజాశక్తి-చిట్వేలి

బైండోవర్ పేరుతో టిడిపి శ్రేణులు పై కేసులు పెట్టడం దారుణమని టిడిపి మండల అధ్యక్షుడు కె కె.చౌదరి పేర్కొన్నారు. మండలంలో ఇటీవల కాలంలో టిడిపి శ్రేణులపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేస్తూ ఉండడంతో, శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో టిడిపి నాయకులతో కలిసి కెకె.చౌదరి బైండోవర్ కేసులకు సంబంధించి ఎస్ఐ సుధాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుం డటంతో మండలంలో గతంలో ఎలాంటి వివాదాలకు తావులేని టిడిపి శ్రేణులపై కావాలనే బైండోవర్ కేసులు పెడుతున్నారని అన్నారు. గతంలో వివాదాలకు, అరాచకాలకు పాల్పడిన వారిని వదిలేసి ఎటువంటి నేరచరిత్ర లేని వారిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల లీగల్ సెల్ అడ్వైజర్ నాయిని బాలాజీ, మండల టిడిపి వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ రాజు, రాజంపేట పార్లమెంట్ టిడిపిఅధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్, మైనార్టీ మండల అధ్యక్షులు కరీం భాషా, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గుండాలయ్య యాదవ్, జిల్లా ఎస్.సి సెల్ కార్యదర్శి కొత్తూరు ఈశ్వరయ్య, మైలపల్లి పంచాయతీ టిడిపి అధ్యక్షులు రవీంద్రరాజు పాల్గొన్నారు.

పులిసంచారం

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలోని పెద్దతిప్ప సముద్రం గ్రామ సమీపంలో బోడిగుట్ట దగ్గర రెండు పులుల సంచరిస్తుండడంతో పశువులకాపరులు, ప్రజలు భయాం దోళనకు గురవుతున్నారు. శనివారం గ్రామ సమీపంలో మామిడి తోటకు కాపలాగా ఉన్న రమణపై దాడి చేయబోయిందని తెలిపారు. గుట్ట పక్కనే సొన్నూరుపల్లి, పెద్దతిప్పసముద్రం గ్రామాలు ఉన్నాయి .నిరంతరం ప్రజలు ఈ ప్రాంతంలో సంచరిస్తు రద్దీగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. పులుల నుంచి ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో మామిడి తోటల్లో పులులు సంచరించిన ఆనవాళ్లు ఉన్నట్లు ప్రజలు తెలిపారు.అటవీ అధికారులు పులుల సంచారంపై దృష్టి సారించాలని, రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పులి పాదముద్ర

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసలు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 25 వరకు అపార అనుభవం కలిగిన మా కళాశాలలో పాలీసెట్-2024కు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రధానాచార్యులు డాక్టర్. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందచేయుచున్నామని, శిక్షణ పూర్తయిన అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మోడల్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పాలీసెట్ కు ధరఖాస్తు చేసుకునే వారు పదవ తరగతి హాల్ టికెట్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డ్ జిరాక్స్, మొబైల్ ఫోన్ తప్పకుండా తీసుకుని రావాలని సూచించారు.

38 మందిపై బైండోవర్ కేసులు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

నాలుగు బైండోవర్ కేసులో 38 మందిని శనివారం తహశీల్దార్ వద్ద హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. వైసిపికి చెందిన 19 మంది, టిడిపికి చెందిన 19 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. నాటుసారా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల్లో నిందితులుగా ఉన్న వారు మంచి నడవడికను కలిగి ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా మెలగాలని సూచించారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కుటుంబ కలహాలతో యువకుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..వాల్మీకిపురం పంచాయతీ పునుగుపల్లికి చెందిన నరసింహులు కుమారుడు సొనకంటి అరుణ్ కుమార్(25) డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. కుటుంబ కలహాలతో పునుగుపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. యువకుడి తల, శరీరం విడివిడిగా పడిపోయాని, సంఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరుణ్‌కుమార్(ఫైల్‌ఫొటో)

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పలవారినపల్లి చెందిన చెర్లోపల్లి మహేశ్వర కనిపించలేదని అతని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఎస్ఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు. శనివారం గండి దగ్గర ప్రత్యక్షం కావడంతో పోలీసు సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.